క్లుప్తంగా

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: మండలంలో అర్హత ఉన్న కాపులకు కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో హనుమంతురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ ద్వారా 2024–25 సంవత్సరానికి చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా అర్హత కలిగిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులు, ఆర్థికంగా బలహీనమైన విభాగం ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్లో ఫిబ్రవరి ఫిబ్రవరి 6వ తేదీ లోపు ఆన్లైన్లో నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొౖడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

51 మందికి కంటి పరీక్షలు

సంతనూతలపాడు: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో శనివారం ఒంగోలు సర్వ నేత్రాలయ రెటీనా కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 51 మందికి కంటి పరీక్షలు, చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. రెటీనా స్పెషలిస్ట్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మానస పెనుమచ్చ ఆధ్వర్యంలో టెక్నీషియన్లు మొబైల్ వాహనంలో కంప్యూటర్ పరికరం ద్వారా రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. సంతనూతలపాడు లక్ష్మీ మెడికల్స్ యాజమాని చుండూరి సుధాకర్‌రావు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో చూపించుకున్న వారికి ఒంగోలులోని అంజయ్య రోడ్డులో గల సర్వ నేత్రాలయ రెటీనా కంటి హాస్పిటల్లో నెల రోజులపాటు ఉచితంగా ఓపీ చూడనున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.

పది విద్యార్థులకు తగ్గనున్న టెన్షన్

- ఆరు సబ్జెక్టులు..ఏడు పేపర్లు
- ఒక్కో పేపర్‌కు 100 మార్కులు
- పదో తరగతి విద్యార్థులకు ఊరట

పుల్లలచెరువు: పదో తరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టులు ఏడు పేపర్ల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గింది. పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. గతంలో 11 రోజులు పరీక్షలు రాయాల్సి ఉండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. వారిలో ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ప్రకటించింది. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్ష మార్చి 31వ తేదీలో పూర్తి అవుతుంది. ఇప్పటికే ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్‌ను విడుదుల చేసింది. ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇవ్వడంతో విద్యార్థులకు కొంత మేరకు విశ్రాంతి లభించినట్లయింది.

గతంలో ఇలా..

పదో తరగతి పరీక్షలు చాలా సంవత్సరాల పాటు 11 పేపర్లు నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కులు చొప్పున రెండు పేపర్లు నిర్వహించే వారు. సైన్స్‌లో ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి 50 మార్కులు చొప్పున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షకు ఒక్కో రోజు చొప్పున 11 రోజులు నిర్వహించే వారు. కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను



స్టడీ అవర్లో పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించి 11 పేపర్లను 7 పేపర్లుగా కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపర్ 100 మార్కుల చొప్పున, ఫిజిక్స్, బయాలజీ పేపర్లకు ఒక్కో పేపర్‌కు 50 మార్కుల చొప్పున నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న విధానానికి స్వస్తి చెప్పారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022–23 విద్యా సంవత్సరంలో పది పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషల్, సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నపత్రాన్ని ఇచ్చారు. జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్‌లో రాయాల్సి వచ్చేది. గత విద్యా సంవత్సరంలో మాల్యాంకనం చేసేందుకు వీలుగా రెండు పేపర్లు ఇచ్చే వారు.

> **ఒత్తిడి తగ్గి బాగా చదువుకోవచ్చు**
>
> ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. సబ్జెక్టుకు సబ్జెక్టుకు మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతీ పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – శామ్యూల్ జాన్, డిప్యూటీ డీఈవో, మార్కాపురం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి పరీక్షలపై ఉండే భయాన్ని పొగొట్ట వచ్చని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలుగా నిర్వహించనున్నారు.

రాష్ట్రం మాది.. మేం చెప్పిందే జరగాలి!



వివాదాస్పద సత్రంబావి స్థలం ఇదే..



గొట్టిపాటి లక్ష్మిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కురిచేడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం పక్కన వివాదాస్పదంగా కోర్టులో ఉన్న సత్రం బావి స్థలం దేవాలయానిదిగా పంచాయతీ రికార్డుల్లో రాయాలని, రాష్ట్రం మాది.. మేం చెప్పిందే జరగాలని కార్యదర్శి చాంద్ బీని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆదేశించారు. శ్రీ వాసవీ కన్యకా పమరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలయానికి ముఖ్య అతిథిగా శుక్రవారం సాయంత్రం వచ్చిన ఆమె ఆలయం పక్కన ఉన్న స్థలం ఆలయానికే చెందిందిగా పంచాయతీ రికార్డుల్లో రాయాలని కార్యదర్శిని ఆదేశించారు. గతంలో సత్రంబావి స్థలం కింద బస్‌షెల్టర్‌కు, పైన ఆలయం కళ్యాణ మండపానికి ఉపయోగించుకునేలా పంచాయతీ తీర్మానం తెచ్చుకుని నిర్మాణం చేశారు. దాన్ని స్థానిక సీనియర్ సిటిజన్ మేరువ పెద్దిరెడ్డి పంచాయతీ స్థలం ప్రజలకు ఉపయోగపడాలని, ఒక సామాజిక వర్గానికి కట్టబెట్టకూడదంటూ లోక్‌అదాలత్, లోకాయుక్త, హైకోర్టును ఆశ్రయించారు. అందులో పంచాయతీ స్థలం ఎంత ఉంది, ఆలయ స్థలం ఎంత ఉంది? అంటూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లను కోర్టులో దాఖలు చేశారు. ఆ విషయం కోర్టులో పెండింగ్‌లో ఉండగా సత్రంబావి స్థలంలో పైన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. దాని విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు గొట్టిపాటి లక్ష్మితో ప్రస్తావించగా పంచాయతీ కార్యదర్శిని పిలిపించి ఆమెతో తమకు అనుకూలంగా చెప్పించుకున్నారు. ఇటు కోర్టులు, అటు నాయకుల ఆదేశాలతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆలయానికి రెండు వైపులా దారి ఏర్పడేలా నిర్మాణం చేపడతామని, ఎవరు అడ్డువచ్చినా పోలీసులను నిలబెట్టి నిర్మాణం చేయిస్తానని గొట్టిపాటి లక్ష్మి చెప్పడంతో కార్యదర్శి ఏం చేయాలో అర్థంగాక మిన్నకుండిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజలు ఇదేమి చోద్యం, గ్రామంలో అందరికీ చెందిన స్థలాన్ని అందరికి ఉపయోగపడేలా బస్‌షెల్టర్ నిర్మాణం కాకుండా ఆలయానికి అప్పగించే చర్యలకు పాల్పడటం అన్యాయమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికే రామాలయం పేరుతో రచ్చ అరుగును ఆక్రమించారని, కన్యకా పరమేశ్వరిదేవి ఆలయానికి పంచాయతీ స్థలం ఆక్రమణకు తెరలేపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్రం బావి స్థలంలో బస్‌షెల్టర్ ఉండాలని, ప్రజలు ఎండలకు నిలబడే చోటు లేక ఇబ్బందులు పడుతున్నారని, నాయకులకు అన్ని సామాజిక వర్గాల వారి ఓట్లు అవసరమని, ఒక్క సామాజిక వర్గానికి చెందిన వారివి మాత్రమే కాదని ప్రజలు పేర్కొంటున్నారు. మరి కోర్టులు ఏం నిర్ణయిస్తాయో, అధికారులు ఏం చేస్తారో వేచిచూడాలి.

రేషన్ డీలర్‌కు వేధింపులు

- మనస్తాపంతో తీవ్ర అస్వస్థత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీలర్

దొనకొండ: 20 ఏళ్ల నుంచి ఎలాంటి ఆరోపణలు లేకుండా రేషన్‌షాపు కొనసాగించిన డీలర్ రమణను తొలగించడంతో ఆమె మనస్తాపానికి గురైంది. వివరాలు.. మండలంలోని పోలేపల్లి పంచాయతీ పరిధి పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన రమణ రేషన్‌షాపు డీలర్‌గా పని చేసింది. ఆమె దివ్యాంగురాలు. గ్రామంలోని టీడీపీ నాయకులు వికలాంగ పింఛన్ వస్తున్నందున రేషన్ షాపు వదిలేయాలంటూ ఆమెపై తీవ్ర ఒత్తిడి చేశారు. ఆమె కొన్ని రోజుల నుంచి గ్రామ పెద్దలతో మాట్లాడుతోంది. తనకు అంగవైకల్యమని, రేషన్ షాపు ఉంచమని వేడుకున్నా పట్టించుకోవడం లేదు. రేషన్‌షాపు తొలగించడంతో ఆమె మనోవేదనకు గురై తలలో నరాలు చిట్లడంతో చావు బతుకుల మధ్య గుంటూరులోని ఓ



గుంటూరులో చికిత్స పొందుతున్న రమణ

ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలోని చోటా నాయకులు తమ హవా సాగించుకోవాలని డీలర్లను ఇబ్బంది పెడుతున్నారు. డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కాటా ఆంజనేయులు స్పందించారు. బాధితురాలు రమణకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పింఛన్ కోసం తిరిగి అలసి పోయా..

యర్రగొండపాలెం: పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసి పోయానని 78 ఏళ్లలో జీవన పోరాటం చేస్తున్న సరికొండ నాసరమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోని భట్టువారిపల్లెకు చెందిన ఆమె 15 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటోంది. అర్ధంతరంగా అధికారులు ఆమె పింఛన్‌ను తొలగించారు. నాసరమ్మకు ముగ్గురు కుమారులు. ఇద్దరు మృతి చెందగా మరొకరు వేరు కాపురం ఉంటున్నాడు. రెండో కుమారుడి రేషన్ కార్డులో ఆమె పేరు ఉండేది. ఆయన మృతి చెందడంతో కోడలు వేరే ప్రాంతానికి వెళ్లేందుకు రేషన్ కార్డును బదలీ చేసుకుంది. ఆ సమయంలో నాసరమ్మ పేరు తొలగించారని ఆ గ్రామస్తులు తెలిపారు. ఆమె థంబ్ పడకపోవడం, బయోమెట్రిక్‌లో ఐరిష్ నమోదు కాకపోవడంతో కొత్త రేషన్ కార్డు మంజూరు కాలేదని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన తనకంటే చిన్న వయసున్న వారు పింఛన్ తీసుకుంటుంటే ఆమె తీవ్ర



పూరింటి ఎదుట నాసరమ్మ

మనో వేదనకు గురవుతుందని చెప్పారు. ప్రస్తుతం పింఛన్ రాకపోవడంతో ఆమెకు తిండికి కష్టంగా మారింది. పూరి గుడిసెలో కాలం గడుపుతున్న నాసరమ్మ కదల్లేని పరిస్థితిలో ఉంది. చిన్న కుమారుడు తెచ్చిపెట్టే అన్నం కోసం ఎదురు చూస్తూ బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఆమెకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా చర్చి గోపురానికి శంకుస్థాపన



పెద్దారవీడు చర్చి ఆవరణలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో తెలుగు బాప్టిస్ట్ చర్చి గోపురం శంకుస్థాపన సందర్భంగా శుక్ర, శనివారాల్లో ప్రత్యేక ప్రార్థన కూడికల కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థన కూడికలకు చర్చి సంఘ కాపరి బిషప్ రెవరెండ్ గుర్రం శేఖర్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వ సృష్టికర్త ఏసుక్రీస్తు బోధనలు పాటించి ఆయన్ను అనుసరించడం ద్వారా సర్వ సమానవాళికి పాప విముక్తి కలుగుతుందని తెలిపారు. పాపంతో వచ్చే జీవితం మరణమని, పాపానికి దూరంగా ఉండాలని తెలుపుతూ, దేవుడు ప్రేమించినట్లుగానే పొరుగు వారిని ప్రేమించడం ద్వారా నిత్యత అనందం పొందుతామన్నారు. ప్రజలందరూ ప్రేమ సహనం ఐక్యతతో జీవించాలని, సర్వమానవళి బాగుండాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని చెప్పారు. శుక్రవారం రాత్రి శిక్షకులు రామావత్ మంత్రునాయక్ ఆధ్వర్యంలో భక్తి గీతాలతో చిన్నారులు కోలాటం



మాట్లాడుతున్న సంఘ కాపరి గుర్రం శేఖర్

ప్రదర్శించారు. పాస్టర్ ప్రతాపన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ దోరపల్లి జాన్ అగస్టీన్, ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జముల్లమూడి దేవానందం, రెవరెండ్ ఎం.చార్లెస్, రెవరెండ్ డాక్టర్ ఎస్. విజయభాస్కర్, పెద్దారవీడు తెలుగు బాప్టిస్ట్ సంఘ పెద్దలు, యవ్వనస్తులు, సంఘస్తులు పాల్గొన్నారు.

కూటమి తీరు దురదృష్టకరం

- బడుగుల గురించి సున్నితంగా ఆలోచించాలి
- పాలకులు, అధికారులకు ఆ స్పృహ లేకపోవడం బాధాకరం
- ఒంగోలు మార్కెట్‌లోని బాధిత చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: నగరంలోని కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ఇటీవల దుకాణాల కూల్చివేతకు గురైన బాధితులకు తాము మద్దతుగా ఉంటామని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారులు సాయంత్రం వరకు కూరగాయలు అమ్ముకుంటే వారికి కేవలం వేతనానికి సరిపడా మాత్రమే వస్తుందన్నారు. అలాంటి వారి పందిళ్లను దౌర్జన్యంగా తొలగించి వారి ఉపాధిని నాశనం చేస్తే రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఆ నష్టం నెల రోజుల శ్రమని అన్నారు. బడుగుల బతుకుల గురించి సున్నితంగా ఆలోచించాలని, కూటమి పాలకులకు, అధికారులకు ఆ స్పృహ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. చిరు వ్యాపారులంతా మార్కెట్లో ఎక్కడో ఒక చోట కూర్చుని అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. 2020–21 సంవత్సరాలలో కరోనా టైంలో మార్కెట్ ఓపెన్ చేయనీయలేదని, మున్సిపల్ ఆఫీస్ వారు తాళాలు వేయగా, వ్యాపారాలు లేక వారంతా ఇబ్బందులు పడ్డారన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారికి లక్షలు పెనాల్టీలు వేసి డబ్బు కట్టమంటూ ఎక్కడ తెచ్చి కడతారని ప్రశ్నించారు. వడ్డీలు మీద వడ్డీలు కట్టమంటూ వారిని ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. కోవిడ్ టైంలో వేసిన అద్దె, వాటిపై వేసిన వడ్డీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెన్యువల్‌కు వెళితే.. రెన్యువల్ కాలేదని చెప్పి పేర బెట్టి పెనాల్టీలు వేయడం సమంజసం కాదన్నారు. కరోనా తర్వాత మిగిలిన కాలంలో మామూలుగా రావాల్సిన అద్దె మాత్రమే వసూలు చేసుకోవాలన్నారు. మీకు చలానాలు కడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నారని, మీకు అడ్డంగా ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. అంతేగానీ, దౌర్జన్యపూరితమైన వాతావరణం మంచిది కాదన్నారు. కూరగాయలు అమ్ముకునే ఆడవారిపై కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. చిరువ్యాపారులకు ఏ సహాయం కావాలన్నా అండగా నిలబడతామని చుండూరు రవిబాబు స్పష్టం చేశారు.

కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ కొత్త కూరగాయల మార్కెట్‌లో భయానక వాతావరణంలో చిరువ్యాపారుల దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. చుండూరు రవిబాబు ఆదేశాల మేరకు కార్పొరేటర్లు సందర్శించగా, అక్కడ చిరువ్యాపారులపై కూటమి ప్రభుత్వం చూపిన ద్వేషం చాలా బాధాకరమన్నారు. చిరువ్యాపారులపై అధికారులు చేసిన విధ్వంసం ఎన్నో పేద కుటుంబాలలో విషాదం నింపిందన్నారు. వారంతా రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యిలోపు సంపాదించుకుని జీవించేవారేనన్నారు. అలాంటి వారి దుకాణాలను ప్రత్యామ్నాయం చూపకుండా సరుకును కూడా చెల్లాచెదురు చేసి తొలగించడం కక్షసాధింపు చర్యని అన్నారు. బడుగులకు నష్టం కలిగించిన మున్సిపల్ అధికారుల తీరును వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణపై డీఈఓ ఆగ్రహం



హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

సంతనూతలపాడు: మండలంలోని కొనగానివారి పాలెం హైస్కూల్లో విద్యార్థులకు బోధన సక్రమంగా లేదని, మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉన్నాయని డీఈఓ కిరణ్ కుమార్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్‌ను శనివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. మొదట పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వందరోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమ నిర్వహణ తీరును, విద్యార్థుల అభ్యసన స్థాయిలను డీఈఓ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఆశించిని స్థాయిలో లేవని, 45 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో పాల్గొనగా, ఏడుగురు విద్యార్థులకు భోజనం సరిపోకపోవడం, భోజనం రుచికరంగా లేకపోవడం, పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయడం లేదంటూ మండిపడ్డారు. హెచ్‌ఎం గుణ ప్రసాద్, ఉపాధ్యాయులను సంజాయిషీ కోరారు. డీఈఓ వెంట ఎంఈఓ డి.వెంకారెడ్డి ఉండగా, పాఠశాలపై నివేదిక అందజేయాలని అతన్ని డీఈఓ ఆదేశించారు.

ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్‌లో ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ఒంగోలులోని కార్యాలయంలో అందజేశారు. ఎ.ధనలక్ష్మికి చీరాల ఎంపీడీవో కార్యాలయంలో, జవంగుల మల్లికార్జునరావుకు కురిచేడు ఎంపీడీఓ కార్యాలయంలో, గంటా సుబ్బరావమ్మకు ఒంగోలు జెడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకాల కింద ఆఫీస్ సబార్డినేట్లుగా ఉపాధి కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సీఈఓ బి.చిరంజీవి నియామక ఉత్తర్వులు అందజేశారు.

మానసిక వికలాంగులకు చేయూత

సంతనూతలపాడు: మండలంలోని ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ దగ్గర గల శారస్ కవనాంట్ హోంలోని మానసిక వికలాంగులకు ఒక నెలకు సరిపడా మెడిసిన్స్, డైపర్స్‌ను వినుకొండకు చెందిన మహా ఫౌండేషన్ వారు శనివారం అందజేశారు. ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా ఎస్సై ఉయ్యాల హరిబాబు, సంతనూతలపాడు ఎస్సై అజయ్ కుమార్, వసంతరావు చేతుల మీదుగా వాటిని అందజేశారు. ట్రస్టీ రమేష్ మాట్లాడుతూ శారస్ కవనాంట్ సిబ్బంది వికలాంగులకు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో చింతల పెద వెంకట రాయుడు, మహా కో ఆపరేటివ్ సొసైటీ జీఎం రవికుమార్ గుప్తా, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ ఎడ్లబల ప్రదర్శన

పెద్దారవీడు: మండల పరిధి తోకపల్లిలో సద్గురు యోగానంద నరసింహస్వామి వారి 69వ పుట్ట తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా 8వ తేదీ ఉదయం 7 గంటలకు రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుపొందిన విజేతలకు అందజేయనున్నట్లు దాతలు ప్రకటించారు. ఎడ్ల పోటీలో పాల్గొనే యజమానులు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకొని రశీదు పొందాలని, పూర్తి వివరాలకు ఫోన్ 7013687472, 9966983148 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సర్వర్ డౌన్‌తో ఆలస్యంగా పింఛన్‌ల పంపిణీ



వై.పాలెంలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న దివ్యాంగుడు

యర్రగొండపాలెం: సర్వర్ డౌన్ కావడంతో పింఛన్‌లు ఆలస్యంగా పంపిణీ చేయాల్సి వచ్చింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా 1వ తేదిన ఉదయం 5 గంటలకే పింఛన్‌లు పంపిణీ చేయాల్సి ఉంది. శనివారం ఉదయం 9.22 గంటల వరకు సర్వర్ పనిచేయలేదు. ఆ తర్వాత కూడా బయోమెట్రిక్‌లో థంబ్ తీసుకోక పోవడంతో ఐరిష్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఒక్కో పింఛన్‌దారుడికి ఐరిష్ తీసుకునేందుకు తీవ్ర జాప్యం జరిగింది. ఈ కారణంతో పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం వరకు కూడా పింఛన్‌లు పంపిణీ చేయలేకపోయారని తెలిసింది. ఉదయం తమ ఇంటి వద్దకు వచ్చి పింఛన్‌లు పంపిణీ చేసే సిబ్బంది సకాలంలో రాకపోవడంతో అనేక మంది పింఛన్ లబ్ధిదారులు తమకు సమీపంలోని సచివాలయాల వద్దకు చేరారు. విషయం తెలుసుకున్న వారు నిరాశతో వెనుదిరిగారు. ముందు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో సర్వర్ డౌనై ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com